
# గురుదేవుల ఉద్బోధన

# జాగృత ఆత్మల బాధ్యత



వేదమూర్తి తపోనిష్ఠ యుగద్రష్ట

## పండిత శ్రీరామశర్మ ఆచార్య

**గురుదేవుల ఉద్బోధన - జాగృత ఆత్మల బాధ్యత**

తృతీయ ముద్రణ : 15,000

14-10-2005 : మాస్టర్‌గారి జన్మదిన కానుకగా

మూల్యము : 12 రూపాయిలు

ప్రతులకు : అపూర్వా పబ్లికేషన్స్, ఒంగోలు

శ్వేతద్వీపము
8-167/3 రాజీవ్‌నగర్,
లాయరుపేట
ఒంగోలు.

డి.టి.పి. : లక్కరాజు లక్ష్మీగోపాల్
జి. శ్రీరంగనాధ్ ప్రసాద్

# జ్ఞానయజ్ఞపు మేలుకొలుపు

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మధురనుండి హరిద్వార్‌కి వెళుతున్న సమయమున 20-6-1971వ తేదీన వీడ్కోలు సమావేశానికి విచ్చేసిన పరిజనుల నుద్దేశించి యిచ్చిన దివ్యసందేశము.

ఇది కేవలము పరిజనులకు మాత్రమేకాక యావత్ మానవజాతికి యీ యుగసంధి సమయమున యివ్వబడిన అపూర్వమైన యుగప్రబోధము. యుగగీత. స్పందించగలిగే మనస్సున కిది ఒక అమృతతుల్యమైన చైతన్యఝురి. వాసనాతృష్ణల బురదనుండి బయటపడి ఈశ్వరీయప్రణాళికను పూర్తిచేయగల ధీరులకిది ఒక సవాల్ మాత్రమేకాక కరదీపిక కూడా. గురుదేవుల సూక్ష్మ ప్రేరణను అందుకొని అది మన జీవితాలను శాశించే మహాప్రేరణగా భావించి దీనిని మధించాలి. అప్పుడే మనము నిత్యనూతనమైన, శాశ్వత, సనాతన వేదతుల్యమైన మధురామృతమును యిందుండి గ్రోలగలుగుతాము. తద్వారా గురుపరంపరచే అందివ్వబడిన స్వల్ప సాధనలతో మహత్తర కార్యక్రమాలు నిర్వహించ గల్గుతాము.

ఈనాడు మానవుల యందున్న దుర్బుద్ధిని తొలగించి, సద్భావాలను పెంపొందించి, మానవులలో నిద్రాణంగా వున్న దైవత్వాన్ని మేలుకొలిపి, భూమిపై స్వర్గావతరణ తీసుకురావటానికి గురువుగారు యెన్నుకున్న యేఏకైక మార్గము - జ్ఞానయజ్ఞము. ఈ జ్ఞానయజ్ఞపు కాగడాను వుత్సాహవంతుడైన ప్రతీవ్యక్తి చేతికి అందజెయ్యాలనే పూజ్యగురుదేవుల ఆశయాన్ని పూర్తి చేయవల్సిన బాధ్యత మనందఱి భుజస్కంధాల పైనా వున్నది.

గురుదేవు లందించిన యీ సందేశమును తెలుగులోకి అనువదించి, దాని నెలా అధ్యయనము చెయ్యాలి? ఎలా ఆచరించాలి? తగిన ప్రణాళికలు యెలా వేసుకోవాలి? అనే విషయాలను వివరించటానికి ప్రతీపేరా క్రిందన చింతన-మననల కు సూచనల ద్వారా -

పూజ్యులు డా॥ మారెళ్ళ. శ్రీరామకృష్ణ ఎమ్మెస్సి.పిహెచ్.,డి.


గారిచే సూత్రప్రాయంగా అందించబడినవి. చింతన- మననలను లోతుగా అధ్యయనము చేసి మీ కర్థమైన విషయాలను దినచర్య పుస్తకంలో వ్రాసుకుని వాటిని మీరు ఆచరించి, అందఱికి చెప్పటానికి నిరంతరము ప్రయత్నించండి.

శ్రీమతి లక్కరాజు లక్ష్మిగోపాల్

శ్రీమతి లక్కరాజు రాజ్యలక్ష్మి

శ్రీమతి కాటూరి తేజశ్రీ

1



# యుగసంధి - ఈశ్వరేచ్ఛ

మన మీనాడు యుగసంధి సమయములో వున్నాము. అవినీతి, అవివేకము, దుర్బుద్ధి, దుర్భావనలతో కూడిన అంధకారము అంతరించనున్నది. సమత, మమత, శుచి, ఐకమత్య మాధారంగా నిలవగలిగిన సద్భావనలు, సత్ప్రవృత్తుల ప్రభాతకాలము వుదయించనున్నది. ఈ అరుణోదయ బ్రాహ్మీముహూర్త మందు భావనాశీలురగు జాగృత ఆత్మలు లేచి నిలచి ఈశ్వరేచ్ఛను పూర్తిచేయు పుణ్యప్రక్రియను అలవరచు కోవాలి. ఆత్మబలసంపన్నులగు ఆత్మలు యీ పనిని అవసరమయినపుడల్లా చేస్తూనే వున్నాయి. ఈ విశిష్ఠ సమయాన మనందటి భుజస్కంధాల మీద కొన్ని విశిష్ఠమైన కర్తవ్యాలను నెరవేర్చవలసిన బాధ్యత వున్నది. స్వార్థముతో నిండిన అహంకారపూరితమైన బురదనుండి బయటపడి మనమంతా కలిసి యుగధర్మపాలనకు నడుము బిగించి నిలుచుట చాల అవసరము.

చింతన - మననల కు సూచనలు

అ) ఇదివరకు యుగసంధి కాలములోని పరిస్థితులు, దాని వివరణలు.

ఆ) రావణాసురుడు- ఋషుల తీవ్ర ప్రయత్నాలు- రాముని అవతరణ. (దశరథుని శాపము, పుత్రకామేష్టీ యజ్ఞము- ముగ్గురు తల్లులు)- రామునికంటే ముందు దివ్యాత్మల అవతరణ.

ఇ) కృష్ణావతార సమయంలోని వివరాలు- విశిష్ట ఆత్మల త్యాగము.

ఈ) కల్కి అవతారము- రావల్సిన మార్పులు- గురుసత్తా ఆవిర్భావము.

## 2



# యుగ బాధ్యతల అవగాహన

మన పరివార్‌లోని ప్రతి ఒక్కరూ "దుష్ప్రవృత్తుల, దుర్భావనలతో నిండిన చీకటి యుగము గడిచిపోయినది" అనే విశ్వాసాన్ని కలిగి వుండాలి. ఆరిపోయే ముందు దీపము క్షణకాలము ప్రజ్జ్వరిల్లినట్లు, క్రిమికీటకములు వాటి మరణ సమయము వచ్చినప్పుడు తండోపతండాలుగా పుట్టుకొచ్చినట్లు యీనాడు పాపము, అవివేకము చాలా తీవ్రముగా నున్నవి. సూర్యోదయానికి ముందు దట్టమైన చీకటి వ్యాపించివున్నట్లుగానే యీనాడు దుష్ప్రవృత్తులు నలువైపులా క్రమ్ముకుని వున్నవి. కానీ అవి యెక్కువ కాలము వుండవు. సృష్టి సంతులనాన్ని స్థిరంగానుంచు దివ్యసత్తా (శక్తి) తన ప్రతిజ్ఞానుసారముగా ప్రభాతకాల అరుణోదయ రూపాన వుదయించనున్నది. మఱియు మానవునిలో దైవత్వ అవతరణ, పృథ్విపై స్వర్గావతరణకు సమయ మాసన్న మైనది. "యదా యదా హి ధర్మస్య......" అనే తన ప్రతిజ్ఞ పూర్తి చేయుటకు సవితా దేవత, జనజాగృతికి, నవనిర్మాణమునకు కావలసిన ప్రఖర కిరణములతో వుదయించు చున్నాడు. ఈ వీడ్కోలు సమారోహానికి ఆహ్వానించబడినవారు యిటువంటి యుగసంధి కాలము వచ్చినప్పుడు తమ విశిష్ఠ కర్తవ్యాలను పాటించవల్సి వున్నది. యుగసంధి కాలపు బాధ్యతల, పునరావృత్తి జరుగబోవుచున్నది. మనమంతా ఈశ్వరుని ప్రయోజనములను పూర్తిచేయుటలో ఎలుగుబంట్లు, వానరులు, గోపబాలుర వలె పూర్తి వుత్సాహముతో

సహకరించాలి. ఈ బాధ్యతలను గుర్తుచేసి ప్రగతి, ప్రయత్నాలను ప్రఖరము చేయుటకొఱకై యీ వీడ్కోలు సమారోహము యేర్పాటు చేయబడినది. ఈ విషయాలన్నీ చెప్పటానికే మిమ్మల్నందరిని ఒకచోట చేర్చాను.

చింతన - మననల కు సూచనలు

*అ) విశ్వాసము మానవజాతికి కాదు. మన పరివార్‌లోని ప్రతి ఒక్కరికి వుండితీరాలి. శిరిడీసాయి గురుసేవ - నిష్ఠ - సబూరి అనే దక్షిణ.*

*ఆ) శ్రీకృష్ణుడు - ఆయన నామాలకి - సవితా దేవతకి సంబంధము - గురువే ద్వాదశాదిత్యులు.*

*ఇ) సృష్టి సంతులన- దత్తావతారము - కొన్ని విశేష ధ్యానములు.*

*1) హనుమంతుని హృదయంలో సీతారాములు.*

*2) శ్రీకృష్ణుని కాళీయ మర్దనము.*

*3) గోవర్ధన పర్వత ఉత్థానము.*

*4) గీతోపదేశము.*

*ఈ) భాగవతము- ఏకాదశ స్కంధము.*

## 3



# యుగ అగ్రదూతలు

ఈ మహాపరివర్తనకు అగ్రదూత వలె మేము రావలసి వచ్చినది. మానవ జీవితంలోని 60 సంవత్సరాలు దీనికొఱకు వినియోగించవల్సి వచ్చింది. మా 24 సంవత్సరముల తపశ్చర్య వెలుగులో అక్కడక్కడ పడివున్న ముత్యములను, మణులను వెతికి ఒక మాల రూపములో గ్రుచ్చితిమి. నేటివఱకు మా జీవితమునకు అదే మహత్వపూర్ణ ఉపలబ్ధి. ఆత్మవిస్మృతి వలన మిమ్ములను మీరు గుర్తించలేకుండా వున్నారు. కానీ మాకు తెలుసు- ఈ యుగనిర్మాణయోజన అనే మాలలో ప్రయత్న పూర్వకంగా గ్రుచ్చబడిన మీరందఱూ ఒకప్పుడు అంగదుడు, హనుమంతుడు, ఎలుగుబంట్లు, కోతులు, భీమార్జునులు, గోప గోపికల స్థితిలో వున్నవారే. వజ్రము బురదలో కూరుకుపోయినా దాని విలువ తగ్గదు. ఈనాడు మనమందరము అహంకారము మఱియు మమకారము యొక్క గోతిలో పడి మోహగ్రస్తమైన బలహీన ప్రాణుల మాదిరే కనిపించుచున్నప్పటికి, వాస్తవికత యేమిటంటే మీరందఱూ కారణ జన్ములే. ఈ వీడ్కోలు సమయములో మీ అందఱినీ యీ సమారోహమునకు పిలిపించి శ్రీరామదూతగా హనుమంతుడికి జాంబవంతుడు కర్తవ్యాన్ని గుర్తు చేసిన విధంగా యుగఅగ్రదూతలుగా మీరు చేయవలసిన పనిని మేము గుర్తు చేస్తున్నాము.

చింతన - మననల కు సూచనలు

*అ) లోభము, మోహము, అహంకారము అనే కుండలీకరణకు చెందిన శక్తిగలవారమే మనమందరము.*

*ఆ) భౌతిక ప్రపంచములో వుంటూ దానికి చెందకుండా జీవించటము అనేది గురుదేవుల జీవితాధారంగా నేర్చుకోవాలి.*

4



# భవిష్యత్తులో అద్భుతమైన పాత్రలు

చీకట్లు పోయి ఉషోదయము కానున్నది. ఈ సత్యమును మనము అనేకసార్లు గుర్తుచేసుకోవాలి. మీ అంతరంగ లోతులలో మీరు యుగనిర్మాణ పరివార్ సభ్యుల మనే సత్యము పూర్తి అవగాహనలోకి రావాలి. విశిష్టాత్ములైన మీమీద యీ యుగసంధి వేళలో విశిష్ఠమైన కర్తవ్యములు మఱియు బాధ్యతలు వున్నవి. సమయము ఆసన్నమైనది. ఎన్నటికీ తీరని కుటుంబ సమస్యలను ఒక ప్రక్కనపెట్టి ఈశ్వరీయ ప్రయోజనము సాధించటానికి యీ యుగ పిలుపు నందుకొని పని పూర్తి చేయుటకు సిద్ధపడవలెను. ఆపద కాలములో సామాన్యమైన పనులను వుపేక్షించి ఆపదలను యెదుర్కొనుటకు సిద్ధపడవలెను. ఈనాడు సరిగా అలాంటి పరీక్షా సమయము. ఆసన్నమైన కర్తవ్యము, బాధ్యతలు ఒక సవాలుగా మారి మన యెదుట వున్నవి. ఈ వీడ్కోలు సమయమున మేము ముందుగా మీనుండి కోరుచున్నది 'ఈ సమయమున ధన సంపాదన, ఆనందము, సంతానము, సరదాలు తీర్చుకొనుటకాదు. కేవలము యుగధర్మమును పాటించుటమాత్రమే శపథపూర్వకంగా చేయాలి.' ఇలాంటి సమయము మాటిమాటికీ వచ్చేదికాదు. కొద్దిమంది అదృష్టవంతులకు మాత్రమే యిలాంటి కాలంలో పుట్టే అదృష్టము వస్తుంది. ఈ ఘడియలను వ్యర్థముగా గడపక మనలో ప్రతివొక్కఱు యుగపరివర్తనకొఱకు యథాశక్తి మీ అక్షయమైన ఆత్మగౌరవము, వర్చస్సుకు తగిన త్యాగ బలిదానములు అందించవలెను.

మీలో ప్రతివొక్కఋు ఒక అర్జునుడిగా మారి పాంచజన్య శంఖారావానికి స్పందించాలి. తమ బాహువుల లోని గాండీవమును గుత్తించవలెను. భారతదేశము ప్రపంచమునకు నేతృత్వము వహించిన " మహా భారతము " యేర్పరుచును. దీనికొఋకై మిమ్ముల్నందఋనీ యిక్కడికి రప్పించి మీ ద్వారా మా సందేశమును రాబోయే రోజులలో అనేకులకు అందించ బోవుచున్నాను. మీరు, మీ ద్వారా నా సందేశమును అందుకున్న ప్రతివొక్కఋూ అతి పెద్ద అద్భుతమైన పాత్రలను భవిష్యత్తులో పోషించబోవుచున్నారు.

చింతన - మననల కు సూచనలు

*అ) యుగధర్మ శపథము తీసికొని పుట్టాము. ఎడ్గర్‌కేసీ-అట్లాంటిక్ పీరియడ్‌లోని వారు మళ్ళీ యిప్పడు పుట్టుకొస్తున్నారు.*

*ఆ) ఈ వాక్యములను చదువుచున్న పాఠకులు తమ అదృష్టాన్ని గుర్తించాలి. ఏమి పొందారో గమనించుకోండి. ఈ అవకాశాన్ని వుపయోగించుకోలేకపోతే యేమి కోల్పోతారో తెలుసుకోండి.*

*ఇ) భారతదేశము 'మహాభారతంగా' యెలా మారుతోందో తెలుసు కోవాలి.*

5



# యుగ పిలుపు

ఇప్పటివఱకు మానవ జీవితమంతా సంస్కారవంతులగు ఆత్మలను వెతుకుట, వారిని ఒక మాలగా కూర్చుకుని యుగపరివర్తన పుణ్యప్రయోజనము నందు నియమించుటకు సరిపోయినది. నా సాధనంతా యీ ప్రయోజనాలకొఱకే చేయబడినది. నా సాహిత్యము ద్వారా సత్యము, ప్రేమ, న్యాయముల మూసలో మానవీయ చేతనత్వము పోసి వుదారత్వము, సద్భావనలు, సహకారముల ఆధారముగా సమాజ నిర్మాణము చేయదలిచితిని. 'ఋతుంభరా ప్రజ్ఞ' మూర్తీభవించిన సహృదయ రూపమగు దేవత గాయత్రీమాత మఱియు పుణ్యపరమార్థముల దేవత అయిన యజ్ఞపితలను ఆధారముగా తీసుకుని గాయత్రీ యజ్ఞములను, సాధనాత్మకములైన, ఆందోళనా త్మకములైన వుద్యమములుగా నడిపి వాతావరణము నందు దైవీచేతనత్వమును వుదయింపజేసి, దేవప్రవృత్తుల ప్రవాహమును పెంపొందింపచేసితిమి. సాధారణమైన వ్యక్తికికూడా యిది అందించేందుకుగానూ -- మా లేఖిని, వాక్కు, చింతన, మననము మఱియు అనేక రచనాత్మక కార్యక్రమములు మఱియు ధ్వంసాత్మక క్రియాకలాపాలు ద్వారా త్వరలో కచ్చితంగా యుగపరివర్తన వలన రానున్న మార్పులు, ఆదర్శముల స్వరూపము అందఱి ముందూ వుంచాను. స్నేహ, సంపర్కములను పెంచి, ఆశీర్వాద వరదానముల ద్వారా సంబంధిత వ్యక్తులను నవయుగముయొక్క అరుణోదయ దిశవైపు నడుచుటకు ప్రేరణ

నిచ్చుచున్నాను. నన్ను యెవరైనా పూర్తిగా అవగాహన చేసుకోవాలి అనుకుంటే యిది ఒక్కటీ గుర్తుంచుకోండి. నేను వేకువజామున కోడి కూతవలె నిరంతరం ప్రబుద్ధ ఆత్మలకు నవయుగ చేతనత్వ వుషోదయము దగ్గఱలోనే వున్న దనే జరుగబోయే సత్యమును సునిశ్చితముగా తెలియపరుస్తున్నాను.

ఈ వీడ్కోలు సమారోహము ప్రపంచంలో నా యొక్క ఆగమనము మఱియు నేను చేయబోవు మహాప్రస్థానము గురించి పూర్తిగా తెలియజెప్పుటకు యేర్పరచితిని. నాతో సన్నిహిత సంబంధము కలిగిన జాగృతఆత్మలు గాయత్రీపరివార్ రూపములో నాకు చాల దగ్గఱగా వచ్చారు. వీడ్కోలు సందేశ రూపములో నా పరివార్‌లోని వ్యక్తులను ఒక్క కుదుపు కుదిపి వారి యొక్క యీ పరిస్థితులలో జన్మించిన విశేషమైన పాత్రతను గుర్తించి తదనుగుణ్యంగా జీవించమని విశేషంగా నిర్దేశిద్దామనే ఆలోచన యీ రోజులలో నిరంతరము నా మనస్సున మెదులుచున్నది. వీడ్కోలు సందేశము ద్వారా – నా పరిజనుల అంత:కరణములో, నా అంతరంగములోని జ్వాలను ఒక్కొక్కరిలో నిప్పుకణిక వలె ప్రవేశింపజేసి యింతవఱకు మీరెలా జీవిస్తూన్నా యింక భవిష్య జీవనము – లోభ, మోహ, అహంకారములతో జీవించవద్దనే ప్రేరణ యివ్వదలచితిని. ప్రభుసమర్పిత జీవితమును జీవించాలి. ఈనాటి యుగపరివర్తన సంధికాలములో మనలో ప్రతిఒక్కఱూ మన ఆలోచనలను కర్తృత్వమును యీ మార్గములోనే పూర్తిగా వినియోగించాలి. లోకకళ్యాణముకోసము మనమేదైనా చేయటానికి మొదలెడితే మన ప్రస్తుత నిర్వహణా వ్యవస్థ ఛిన్నాభిన్నమౌతుందనే నాస్తిక ఆలోచన జాగృతఆత్మలైన మన పరివార్‌లో రాకూడదు.

స్వార్థపరులు, పాపులు, నిందించేవారు మఱియు నాస్తికులకు కూడా కడుపు

నింపుచున్న ఆ ఈశ్వరుడు ఆయన పనిలోనే నిమగ్నమైయున్న ఆస్థావంతులను (విశ్వాసము కలిగిన వారిని) ఆకలితోనూ, నగ్నంగానూ యెందుకు వుంచుతాడు? భూమ్యాకాశాలను అంటుకొనే కోరికలను యెవఱు పూర్తిచేయగలరు? కానీ జరుగుబాటు సునిశ్చితము. విశ్వకళ్యాణము కొఱకు ముందడుగు వేస్తున్నవారు భగవానుని యొక్క 'యోగక్షేమం వహామ్యహం' అనే మాటమీద విశ్వాస ముంచుకొని 'యుగపిలుపు' అందుకొని యిప్పటివఱకు చేసిన దానికంటే చాల యెక్కువ పనిచేయుటకు కటిబద్ధులు కావాలి. సాహసము చూపించాలి.

చింతన - మననల కు సూచనలు

అ) గాయత్రీ మంత్రము- గాయత్రీ యజ్ఞముల ద్వారా జాగృతాత్మలను వెదికే ప్రక్రియ.

ఆ) వేకువజామున కోడికూత- గురుదేవులు.

ఇ) విశిష్ఠ కార్యక్రమాలు చేసే దీక్ష బూనుట.

6



# గురుసత్తా ఆవేదన

మేము ఏకాంత సాధన, మఱియు వుగ్ర తపశ్చర్యలు చేయుటకు వెళ్తున్నాము. ఇది మా స్వజనులకు దుఃఖము కలిగించుట స్వాభావికమే. కలయికలోని ప్రేమ వలన కలిగే ఆనందము కంటే, వియోగము వలన వచ్చు దుఃఖము యెక్కువ. నేను నా పరిజనులు అందఱిని స్వచ్ఛమైన మనసుతో ప్రేమించితిని మఱియు వారు కూడా నాపట్ల యెంతో స్నేహ సద్భావములను కుఱిపించిరి. నా యీ సుందరమైన జీవితవిధానము చాలాకాలము నుండి నడుస్తూనే వున్నది. ఇప్పుడు దానియందు అడ్డు యేర్పడుచున్నది. ఇది నాకు మిక్కిలి బాధాకరమైనది. నావారినుండి దూరమగుట నాకు బాధాకరమైనదేకాక దుఃఖ కారణము కూడా. వీరినుండి నేను దూరమగుట వలన నా కన్నులు వర్షించుచున్నవి. నా గొంతు గద్గదమై మూగబోవుచున్నది. మా మధ్య వున్న ఐకమత్యము, అనురాగాలు యీ వీడ్కోలు సమయములో వ్యధను మఱీ పెంచుచున్నవి. వియోగముయొక్క యీ వేదన నా అంతరంగములోకి తొంగిచూసి నట్లైతే మీకు బోధపడును. మానవుని దుర్బుద్ధి వలన యేర్పడిన దుష్పరిణామాలను గురించి ఆలోచించినపుడు నా హృదయము ఒడ్డునపడ్డ చేపవలె వ్యధ చెందుచున్నది. ఈవిధమైన వ్యధతోనే నేను యింత కాలము జీవించినాను.

నా స్వప్నము విశ్వమందలి మానవుల దుర్దశలను తొలగించి, భూమిపై

స్వర్గావతరణ జరుపుట. నా పరిజనులు నా అంతరంగ మందలి వ్యధను గుర్తించి దానినే తమ అంతరంగ వ్యధగా మలచుకొనినచో నాపట్ల వారికిగల ప్రేమానురాగాలు నిజమైనవిగా అంగీకరించవచ్చు.

చింతన - మననల కు సూచనలు

*అ) గురుదేవుల ఆలోచనా సరళిని మనము అలవరచుకోవాలి.*

# 7



# బ్యాటరీ ఛార్జ్ చేయవల్సిన అవసరము

నేను యెన్నోసార్లు చెప్పాను- ప్రపంచాన్ని వదిలివేస్తాము, కర్తవ్యాన్ని వదిలి వేస్తాము, ఏకాంతములో శాంతిని వెతుకుతాము అను త్యాగమూర్తులైన బాబాలతో నా సాధనకు యేవిధమైన సారూప్యమూ లేదు. ఆత్మహత్య చేసుకునేందుకు బావిలో దూకినవాడు, వాడిని రక్షించుటకు బావిలో దిగినవారి క్రియాకలాపాలు చూచుటకు ఒకే విధముగా వున్ననూ దాని పరిణామమందు చాల తేడా వున్నది. గృహత్యాగము చేసిన వారికి, కర్తవ్యవిముఖులకు, పైన చెప్పిన జ్ఞానులకు నేను పూర్తిగా వ్యతిరేకము. నేను శక్తిని సంగ్రహము చేయుచున్నాను. ఆ శక్తిని సిద్ధుల కొఱకు, స్వర్గము కొఱకు, ముక్తి కొఱకు కాదు, ప్రపంచం మేలు కొఱకు మాత్రమే వుపయోగిస్తాను. ప్రారంభ జీవితమందు 24 సంవత్సరముల గాయత్రి తపస్సు ద్వారా కూడబెట్టిన సామర్థ్యమును గత 20 సంవత్సరముల కార్యక్రమములకు ఖర్చు చేసితిమి. నేను 24 సంవత్సరముల సాధనతో సముపార్జించినది మతాబాలా కాలుతున్నదని భావించవలెను. నాకు నా గురుదేవులు అప్పుచెప్పిన పనిలో చేయవలసినది చాల వున్నది. మోటారుకు బ్యాటరీ అయిపోయినపుడు మళ్ళీ ఛార్జి చేయాలి. భావి తపశ్చర్య ఫలస్వరూపముగా కావల్సిన శక్తి సముపార్జన చేయబడుతుంది. దానివలన ఆగిన బండి మళ్ళీ ముందుకు సాగుతుంది.

చింతన - మననల కు సూచనలు

*1) తపస్సు నిరంతరము కొనసాగిస్తూ వుండాలి.*

## 8

# యుగపరివర్తనకు అవసరమైన పనులు

ఇప్పటివఱకూ నేను సుమారుగా 50 లక్షలమంది సుసంస్కారవంతులు, భావసంపన్నులు మఱియు జాగృతఆత్మలను వెదికి స్నేహ సూత్రాన బంధించి వారికి దిశాబోధ చేయగలిగాను. ఇంత పెద్ద సమూహము నవయుగనిర్మాణానికి తమ ప్రతిభను వుపయోగించగలిగినచో పని చిటికెలో పూర్తియగును. కాని వారియందు త్యాగము, బలిదానములు చేయగల స్ఫూర్తి లేకపోవుటయే చింతించవలసిన విషయము. ఈశ్వరుని అనుగ్రహాన్ని పొంది విశ్వమానవులుగా సేవ చేయుటకు ముందుకొచ్చినవారు తప్పక సమర్థులుగానూ, మహామానవులుగానూ తయారు కాగలరు. దీనికి ఆత్మబలము, సాహసము కావాలి. ఇవి కావాలంటే వ్యక్తిగతమైన లోభమోహా లుండరాదు. కుటుంబములోని వారి వ్యతిరేకత, స్నేహితులు, పరిచితులు చేసే యెగతాళిని వుపేక్షించి యుగపరివర్తనకు అవసరమైన పనులు పూర్తిచేయాలి. ఇప్పుడు నేను యీ ఆత్మబలమును సంపాదించి భావనాశీలురైన నా పరిజనుల ఆత్మబలాభివృద్ధికి వితరణ చేయుదును. దీని ఆధారముగానే వారు తమ జీవిత వుద్దేశ్యమును సఫలము చేసుకొని విశ్వమానవతకు అవసరమైన దానిని అందించుటలో సమర్థు లగుదురు.

చింతన - మననల కు సూచనలు

*అ) ఈశ్వరానుగ్రహమును పొందుటకు తగిన పాత్రతను నిరూపించుకోవాలి.*

9



# మహామానవులుగా మారే చిట్కా

వాసన, తృష్ణల బురద నుండి బయటపడి నా పరిజనులందరూ ఈశ్వరీయ ప్రణాళికను పూర్తి చేయుటకు ముందుకు సాగవలెను. నేను జీవితంలో శాంతిని, విశ్రాంతిని యెఱుగను. నేను ప్రేమించువారిని సహజంగా వదలను. వారిని ఒక అదృశ్యశక్తి ముందుకు నడిపిస్తున్నది అనే భావన నిరంతరము కలుగుతుంది. ధనసంపదలను గురించి, కుటుంబము గురించిన ఆలోచనను మన పరిజనులు వదిలివేయాలి. యుగసంధి బాధ్యతలను చేపట్టాలి. దేనికొఱకు నేనీనాడు యీ వీడ్కోలు సమావేశానికి యెవరిని బలవంతముగా రప్పించానో, యెవరికి మీ ద్వారా యీ సందేశము అందుతుందో వారికి నిరంతరము ఒక అదృశ్యశక్తి వెనుకనుండి యీ యుగపరివర్తన కొఱకు పని చేయమని వివశులను చేస్తున్నదనే అనుభూతి కలుగుతూనే వుంటుంది. నా పరిజనులకు నా వ్యక్తిత్వము, అస్తిత్వము, నిరంతరము ప్రక్కనే వున్నట్లు గాఢానుభూతి కలుగుతూ వుంటుంది. నాకు యీ జన్మ ఒక అగ్రదూత భూమికను నిర్వహించుటకు యివ్వబడినది. ఇప్పటివఱకు బొమ్మలను తయారుచేసి నిలబెట్టితిని. ఇక వాటియందు ప్రాణశక్తిని నింపెదను. ఈనాడు యెందుకూ కొరగానివారు త్వరలో మహామానవులుగా మాఱితీరుతారు. నేను చేయనున్న తపస్సుకు ప్రధాన కారణము యీ ప్రయోజనాన్ని పూర్తి చేయుట కొఱకు అని మీరు గ్రహించాలి.

చింతన - మననల కు సూచనలు

*అ) గురుదేవుల సూక్ష్మ ప్రేరణను అందుకొని దానిని మన జీవితాన్ని శాశించే మహాప్రేరణగా మలుచుకోవాలి.*

## 10



# ఒకేచోట శక్తి సముపార్జన

సమర్థగురురామదాసు తన తపస్సులోని ఒక భాగాన్నిచ్చి శివాజీ మహా రాజు చేత కొంత పనిని చేయించిరి. రామకృష్ణపరమహంస నుండి శక్తిని పొందిన వివేకానందుడు తన పనినిచేసెను. చాణిక్యుని అనుగ్రహముతో చంద్రగుప్తుడు పని చేసెను. ప్రతివారు స్వయంగా సాధన చేసి ఆత్మబలసంపన్నులై పని చేయవల్సిన అవసరము లేనేలేదు. విద్యుచ్ఛక్తికి ఒక వుత్పాదనా కేంద్రము వుంటుంది. దానితో సంబంధము పెట్టుకొని అనేక యంత్రాలు పనిచేయుటకు శక్తిని పొందుతాయి. ప్రతిఒక్కఱూ తపస్సుకు అవసరమైన కఠినమైన శారీరిక, మానసిక నియమాలను అనుసరించుట, నిర్వహించుట చాల కష్టము. శక్తివుపార్జన ఒకేచోట జరిగి అసంఖ్యాక యంత్రాలు దానిని వుపయోగించుట జరుగుతుంది కదా! అదేవిధముగా సాధనకు సంబంధించిన పెద్దపెద్ద నియమాలను గురించి మీరు చింతించపనిలేదు. ప్రపంచానికి మేలు చేయు ఆలోచనగల వారందఱికీ అవసరమైన అనుదానాలను నేను నిరంతరమూ అందిస్తూనే వుంటాను. ఈవిధముగా అంధులను, కుంటివారిని కలిపి ఒక మహా ప్రయోజనాన్ని నేను పూర్తి చేయగలను. పరిజనులలో లోకకళ్యాణము చేయువలెనను భావనగల వారికి నా పూజ్య గురుదేవులు నాకందించినట్లుగానే నేను జాగృత ఆత్మలకు కావలసిన సామర్థ్యమును, మార్గదర్శనమును అందిస్తాను.

చింతన - మననల కు సూచనలు

*అ) గురుపరంపర స్వల్ప సాధనతో మహత్తర కార్యక్రమాలు నిర్వహించుట- దానికి తగిన సాధనా విధానము నలవరచుకొనుట.*

*ఆ) గురుసత్తా సంస్థలు ప్రపంచానికి యేమి అందించాయో మనము యికముందు యేమి చేయాలో నిర్ణయించుకుని ఆ పరంపర కొనసాగించాలి.*

## 11



# పనిని బట్టి అనుదానము

యుగసంధి యొక్క యీ విపత్కర పరిస్థితులలో ప్రతీ సాధకుడూ నేను వ్యక్తిగతముగా వంట చేసుకుని తింటాననే జంఝాటములో పడగూడదు. ఒకే అన్నపూర్ణాలయంలో అందఱూ ఆహారము తినాలి. జప, తప, ధ్యాన, అనుష్ఠాన, పురశ్చరణ కార్యక్రమాలు పెట్టుకుంటే సాధకులందఱూ అందులోనే యిరుక్కుని పోతారు. ఉచ్చస్తరీయ సాధనా సఫలతకు చాలా శ్రమపడవల్సి వుంటుంది. మఱియు అనేక జన్మలు పట్టవచ్చు. తనే నావను తయారుచేసుకుని, నడపటము నేర్చుకుని, తన పురుషార్థముతో నదిని దాటుట మంచిదే, కానీ దానికి ఓర్పు, ధనము, కాలము కావాలి. సరళమైన పద్ధతేమిటంటే పడవవున్న నావికుని సహాయము తీసుకోవటము. ఈ వీలు నేను నా పరివారము కొఱకు కేర్పాటు చేస్తున్నాను. ఆంతరిక శక్తి మఱియు ప్రగతి కొఱకు నా పరిజనులకు అవసరమైన ఆత్మబలమును నే నందజేస్తాను. కానీ యిది వుచితముగా యివ్వబడదు. ఆపత్సమయములో లేక పరమార్థ ప్రయోజనము కొఱకు దేన్నైనా యివ్వవచ్చు. కానీ స్వార్థసిద్ధి కొఱకు యితఱుల ఆర్జన స్వీకరించట మనేది అనైతికము. ఆశీర్వాద, వరదానములు కూడా భిక్షావృత్తిగా స్వీకరించరాదు. ఆత్మప్రగతికివి సహాయపడవు. ఏది తీసుకోవాలన్నా దానికి తగిన మూల్యము చెల్లించి మాత్రమే తీసుకోవాలి.

ఏ లక్ష్య సాధన కొఱకు నేను యీ జన్మ తీసుకొని అత్యంత క్లిష్టమైన వుగ్ర

సాధనలు చేశానో, ఏ లక్ష్యమైతే నాకు ప్రాణప్రదమైనదో ఆ లక్ష్యసిద్ధి కొఱకు యెవరెంత యెక్కువ సహకారాన్ని అందజేయగలరో, వారు అంతగా నా భవిష్య తపశ్చర్యల ద్వారా పొందిన ఆత్మబలమును వుపయోగించుకోగల్గుతారు. పూజా స్తోత్రములద్వారా వచ్చే వుదాత్తమైన విలువలు, సంపదలు కొఱకు చేసినట్లైతే ఆ వున్నతిని కోల్పోయి నిమ్న స్థాయికి చేరుకుంటారు. ధనము, సంతానము మొదలుకొని ముక్తి మోక్షము మొదలగు కోరికల కొఱకు చేసే పూజా స్తోత్రములు విలువలను, ప్రాముఖ్యమును దిగజార్చివేస్తాయి.

చింతన - మననల కు సూచనలు

*అ) గురుదేవుల అనేక లక్ష్యాలలో మీరు అనుకరించగలిగే కార్యక్రమాలను స్పష్టంగా ఒక ప్రణాళికగా రూపొందించుకోండి.*

12



# పూర్ణ సమర్పణ - పూర్ణ అనుదానము

ఈనాడు మానవుల యందున్న దుర్బుద్ధిని తొలగించుటకు నేను జ్ఞాన యజ్ఞము యొక్క శుభారంభమును చేయవల్సి వచ్చింది. ఈ కేంద్ర బిందువు చుట్టూనే నా కార్యక్రమాలు కొనసాగించబడ్డాయి. ఈనాటి అనేక ఆపదలకు ఒకే కారణము 'మానవుని దుర్బుద్ధి'. దానిని తొలగించకుండా కొండంత సుఖాన్ని తెచ్చిపెట్టినా యీ దుఃఖదారిద్ర్యములు పోవు. ఒక వ్యక్తిలోగానీ, సమాజములోకానీ సుఖశాంతు లేర్పడాలంటే సద్బుద్ధి, సద్భావనలు, సత్ప్రవృత్తులను వ్యాపింప చేయుట యెంతైనా అవసరము. అన్ని సమస్యలకు ఒకే ఒక్క పరిష్కారమైన భావనాత్మక నవనిర్మాణముమీదే నా సమస్త ధ్యానము కేంద్రీకృతమై వున్నది. దీనికొఱకే జ్ఞానయజ్ఞము, విచారక్రాంతి అభియానము యేర్పాటు చేయబడినది. నా మార్గదర్శకులు (దాదా గురుదేవులు) యీ ప్రయోజనమును పూర్తిచేయుటకే నన్ను యిక్కడికి పంపిరి. ఆ దివ్యశక్తి ఆదేశాలను పాలించుటలో నన్ను నేను పరిపూర్ణముగా సమర్పించుకొన్నాను. ఆ దివ్యసత్తా ఆదేశాలను కార్యరూపంలో తేవటానికి నేను నా యొక్క అస్థిత్వము యొక్క ఒక్కొక్క కణాన్ని సమర్పించాను. ఆ సమర్పణా మూల్యముగా నాకు ఆ దివ్యశక్తి నుండి నిరంతరము వరదానములు లభించినవి. ఈ వంశపరంపర యీవిధముగానే ముందుకు సాగాలనే నా కోరిక. నేను మూల్యమును చెల్లించి గురు అనుగ్రహమును, దైవీ అనుదానాలను పొందాను. ఈ వీడ్కోలు సందేశ రూపముగా నా కోరిక యేమిటంటేయే దివ్యశక్తి ప్రేరణతో నేను అనేక అనుదానములను పొందానో - అదే మార్గమున నా సహచరులుకూడా నడిచి వాటిని పొందవలెను. అభీష్ట

ప్రయోజనముల కొఱకు నా మార్గదర్శకుల నుండి సహయోగము, శక్తి మఱియు తపస్సు నాకు అనంతముగా నిరంతరం లభించుచునే యున్నవి. నా పరిజనులు కూడా అటువంటి అనుగ్రహ వరదానాలు పొందుతూనే వుంటారని నేను గ్యారెంటీ యిస్తున్నాను. కానీ నా యొక్క అనుదానాలకు తగిన మూల్యాన్ని చెల్లించాలనే విషయము మఱువరాదు. ఏ దివ్యపథమునందు నా రోమరోమము ఆహుతి రూపమున మండించుకున్నానో, కఱిగించుకున్నానో దానికొఱకు కొంత త్యాగమును మీరందఱూ చేసి తీరవలెనుకదా! జ్ఞానయజ్ఞమునకు ఒక గంట సమయము, పదిపైసలు అంశదానముగా యివ్వడము లోభమోహముల బురద నుండి బయటపడి వెలుగు కిరణములు చూచుటకు ప్రారంభిక ప్రయోగము. ఇంతమాత్రమే హద్దుగా భావించి కూర్చొనరాదు. సాహసము, వుత్సాహమును నిరంతరము పెంచుకొనుచూ చివరికి వారు కూడా మా వలె సర్వమేధము చేసుకొని సర్వము అర్పించాలి. సర్వమూ పొందాలంటే పూర్ణసమర్పణ అనే యీ షరతును పాటించాలి. ఈ సత్యమునెంత త్వరగా అర్థము చేసుకుంటే అంత మంచిది.

చింతన - మననల కు సూచనలు

*అ) జ్ఞానయజ్ఞ శుభారంభము- రోజుకు ఒక గంట సమయదానము మరియు రోజుకో రూపాయి అంశదానముతో ప్రారంభించాలి.*

*ఆ) జ్ఞానయజ్ఞ పరిణితి పరిపూర్ణ సమర్పణగా జరగాలి.*

13



# జ్ఞానయజ్ఞమునకు యెక్కువ సమయమివ్వండి

యుగపరిస్థితులకు అనుకూలముగా తత్త్వదర్శులైన ఋషులు విశిష్ఠమైన సాధనాక్రమమును నిర్దేశించుచుందురు. నేటి పరిస్థితులలో ప్రజల యొక్క మానసిక, భావనాత్మక, నవనిర్మాణము కొఱకు నేను జ్ఞానయజ్ఞము లేక విచారక్రాంతిని సర్వోత్తమమైన యుగసాధనగా అందిస్తున్నాను. పరిజనులు తమ సమస్త శక్తి సామర్థ్యములను దీనికొఱకే వినియోగించవలెను. నేటి పరిస్థితులలో కాలము యొక్క సవాలును స్వీకరించి ఈశ్వరానుగ్రహమును, ఆత్మశాంతిని పొందుటకు యింతకంటే మంచి సాధన మఱియొకటి లేదు. ఒక అరగంట గాయత్రి మంత్ర జపము చేసి తద్వారా శరీరము, మనస్సు, అంతఃకరణముల యందు ఈశ్వరుని దివ్యప్రకాశ అవతరణము జరుగుచున్నట్లు భావించవలెను. ఈ చిన్న సాధన చాలును. ఉపాసన నిత్యక్రమము నిరంతరము నియమిత రూపమున చేయవలెను. నా తపశ్చర్యలోని ఒక అంశను యిచ్చి పెద్దపెద్ద అనుష్ఠానాలు, పురశ్చరణ దేనికొఱకైతే చేశామో ఆ ఫలితాలు మీకు అందేటట్లు చూస్తాను. జప తపములకు మీరు యెంత సమయమును కేటాయించదలచుకున్నారో దానిని జ్ఞానయజ్ఞము కొఱకు వుపయోగించండి. మీ సమయము, శ్రమ, మనస్సు, బుద్ధిని, ప్రభావక్షేత్రమును మఱియు ధనము నెంత యెక్కువ వీలైతే అంత యెక్కువ జ్ఞానయజ్ఞము కొఱకు వుపయోగించండి.

ఇది యీ యుగపు సర్వశ్రేష్ఠ ఆధ్యాత్మిక సాధనగా గుర్తించండి. ధనము,

సంతానము నుండి స్వర్గము, ముక్తి కొఱకు కోరికలు పూజా స్తోత్రముల విలువను ప్రాముఖ్యతను దిగజార్చివేస్తాయి. ఉపాసన, ఆరాధనలతో పాటు ప్రేమ మఱియు పరమార్థ ప్రవృత్తి వికసించుట చాల అవసరము. ఇది జరుగకపోతే మొత్తము జప, తపము కొఱకు వినియోగించిన శ్రమ చాల భారమైనదిగా అయి దానినుండి పొందే ప్రతిఫలము అతి స్వల్ప మౌతుంది. పరమార్థ దృష్టి లేకుండా ఆధ్యాత్మిక ప్రగతి ఆశించుట నిరర్థకము. జపతపముల వలన వచ్చు లాభముకంటే జ్ఞానయజ్ఞ సాధన వలన అధికమగు లాభమే నిశ్చయముగా కలుగునని విశ్వసించండి. స్వార్థము భౌతికమైనదైనా లేక ఆధ్యాత్మికమైనదైనా అది వ్యక్తి యొక్క క్షుద్రత్వానికి ప్రతీక. అందువల్లనే ప్రపంచము నందలి గొప్ప సాధకులందఱూ తమ జీవితమందలి అధిక భాగము లోకశ్రేయస్సు కొఱకు సమర్పించిరి. ఈశ్వరుని పొగడి లంచమిచ్చి ఆయన అనుగ్రహము పొందలేము. భక్తుల వరుసలో నిలబడి సేవద్వారా పరమార్థ ప్రయోజనము కొఱకు పని చేసినపుడే ఆత్మబలము పెరిగి దానికి తగిన స్థాయిలో ఈశ్వరుని అనుగ్రహము పొందగలము.

చింతన - మననల కు సూచనలు

*అ) దేశకాల పరిస్థితులనుబట్టి మహనీయులిచ్చిన సాధనలు మాత్రమే వుపయోగపడతాయి. మనకు నచ్చిన సాధనలు వుపయోగపడవు.*

*ఆ) వ్యక్తిగత సాధనకు తక్కువ సమయము కేటాయించి, సాధ్యమైనంత యెక్కువ సమయము జ్ఞానయజ్ఞమునకు కేటాయించాలి.*

*ఇ) సాధ్యమైనంత వరకు కోరికలు తగ్గించుకుంటూ విశ్వకళ్యాణ కార్యక్రమములలో పాలుపంచుకోవాలి.*

14



# సర్వసమర్పణ

నాకు - నా గురుదేవులకు, నా జీవితములో యితఱులతో వున్న అతి మధురమైన అతి ఘనిష్టమైన సంబంధమునకు ఆధారము నన్ను నేను మఱచిపోవుటే. నేను జీవించి వున్నానా, మరణించినానా అనే విషయము నాకు తెలియదు. ఈశ్వరుని కోరికయే నా కోరికగా, వారి అవసరమే నా అవసరముగా మలచుకొని ఆపదల కష్టాల పరీక్షలను సౌభాగ్యముగా అంగీకరించి నిరంతరము యిష్టదేవుని సంకేతాలపై తోలుబొమ్మ వలె నాట్యమాడుటే నా సమర్పణ. ఇది సాధనయొక్క ప్రాణము. లోభ మోహముల తృప్తికొఱకు ఒక బిచ్చగాని వలె పండ్లికిలించుట, దీనముగా యాచించుట మొదలగు హావభావములు ప్రకటించుట ఈశ్వరుని భక్తికి తగని పనులు. ఈవిధమగు పనులు వేశ్యావృత్తుల వంటివి. వాటివలన భక్తి, భక్తుడు, భగవానుడు ముగ్గుఱు తలవంచాల్సి వస్తున్నది. నాయొక్క ఆధ్యాత్మిక వుపలబ్ధుల మూల కారణము సర్వ సమర్పణయే. పూజలు, ఉపాసనాది కర్మకాండలు యీ సమర్పణ అనే పృష్ఠభూమి మీదనే పెరిగి పెద్దవై; ఫలపుష్పాదుల నిచ్చాయి. పరిపూర్ణ సమర్పణ లేకపోతే జీవితాంతము మాలత్రిప్పుట, గంటకొట్టడంవలన ఆశాజనక పరిణామాలు లభించవు.

చింతన - మననల కు సూచనలు

*అ) కోరికలేని నిస్వార్థ సమర్పణ గురువు యొక్క పరిపూర్ణ అనుగ్రహాన్ని కలుగచేస్తుంది.*

15



# అనంతశక్తితో సంబంధము

సాధనా మార్గాన నడిచేందుకు కోరికగలవారికి, విధివిధానము నేర్చుకోదల్చినవారికి నా సలహా ఒక్కటే. అదేమిటంటే ఆ బాధ్యతను పూర్తిగా నామీద వదిలివెయ్యండి. ఒకేచోట వంట చేసుకుని అందఱూ అక్కడికి వచ్చి తమ ఆకలిని తీర్చుకొనుట. ఒక్కడు నావ తయారు చేస్తే అందఱూ దానిమీద నది దాటుట, ఒకచోట పవర్ కేంద్రము యేర్పడి వుండగా అక్కడనుండి అన్ని యంత్రాలకి శక్తి లభించటము; ఒక బావిని త్రవ్వితే అనేకమంది అక్కడికి వచ్చి స్నానాలు చేయట మనేదే సులభ సాధన గదా! నేను సంపాదించిన శక్తితో విశాల పరివారములోని ప్రతిఒక్కరికి ఆత్మబలము లభించి, వారి ఆత్మప్రగతి, వారి జీవిత వుద్దేశ్యపూర్తి మఱియు ఈశ్వరానుగ్రహమును సులభంగా పొంది విజయాన్ని సాధిస్తారు. ఈ లాభము పొందటానికి యుగసాధనలో సంలగ్నమవ్వాలి. యుగసాధన అనగా, జ్ఞానయజ్ఞము లేక విచారక్రాంతి అభియానము. ఈ యుగసాధన యొక్క యీ ఆపత్తికాలీన పరిస్థితులలో ఒకే సేవ, ఒకే సాధన అన్నింటికంటే గొప్పది. అదేమిటంటే ఆలోచనలు మఱియు భావనల క్షేత్రములో అన్నివైపులా వ్యాపించియున్న వికృతులతో పోరాడి ప్రజలందఱికీ సవ్యముగా ఆలోచించటము మఱియు సరైన

క్రియాకలాపాలు చేయవల్సివచ్చే పరిస్థితులు యేర్పరచటము. ఈ ప్రయాసతో వ్యక్తులకు - సమాజానికి కావల్సిన అవసరాలన్నీ పూర్తియగును. మన పరివార్ యొక్క మొత్తము ధ్యానము యీ కేంద్రబిందువుమీదనే వుంచాలి.

చింతన - మననల కు సూచనలు

*అ) యుగ సాధన- జ్ఞానయజ్ఞము-విచారక్రాంతి అభియాన్ క్రియాకలాపాలను అర్థము చేసుకోండి.*

## 16



# యుగ సాధన

పరమార్థము పేరుమీద బావులు, చెఱువులు త్రవ్వించేవారికి, ధర్మశాలలు, మందిరాలు నిర్మాణము చేసేవారికి, బడులు, చికిత్సాలయాలకు ధనాన్ని అందించే వారికి, చలివేంద్రాలు యేర్పాటు చేసేవారికి నా ప్రత్యేకమైన ప్రార్థన - ఈనాటి మానవుని జీవన, మరణ సమస్యకు కారణము ఆలోచనల యందు వికృతి కలుగుట, దానినే అతి తీవ్ర ప్రమాదకరమైన ఆపదగా భావించాలి. సాధన- ఉపాసనలలో రుచిగలవారు దానికొఱకు కేటాయించిన సమయమును తగ్గించుకొని ఆ సమయాన్ని కూడా జనుల మనస్సులను కడుగుటకు కేటాయించాలి. ఈ పుణ్యము పూజాదు లన్నింటికంటే వేలరెట్లు అధిక ఫలాన్ని యిస్తుంది. ఈ యుగసాధన అవలంబించి తమను వుత్కృష్టముగా తీర్చిదిద్దుకుని, సమాజంలో ఆదర్శములను నాటడానికి యెవఱు యెంత యెక్కువగా తమ ప్రయత్నాలను అందిస్తారో వారికి వారి త్యాగ బలిదానాలకు సరిపోయే అనుదానాలను నేను నా తపశ్చర్యల ద్వారా అందచేస్తాను. నా మార్గదర్శకుడు నాద్వారా యిలానే చేయించాడు. ఈ షరతుమీదే తమ సహయోగము, స్నేహము, మార్గదర్శనము, అనుదానమును యిచ్చారు. విశ్వమానవుని కొఱకు యీనాడు అన్నింటికంటే అవసరమైన యీ యజ్ఞంలో సమిధవలె మండి యితరులకి దారి చూపించే సాహసము చేయగల్గేవారికి నా అనుదానాలు లభిస్తాయి. ఈ నవనిర్మాణ జ్ఞానయజ్ఞంలో యెవరెంత పాలుపంచుకోగల్గుతారో అదే నిష్పత్తిలో వారికి నా స్నేహము,

మార్గదర్శనము యెక్కువగానే లభిస్తాయి. తక్కువగా కాదు. మీకు నా మీదున్న ప్రేమ-మీరెంత యీ పుణ్యప్రయోజనాలకోసము చేశారనేది గీటురాయి అవుతుంది. ఈ లక్ష్యసాధనకే నా మొత్తము జీవితము సమర్పితమైవున్నది. అనేకమంది నాతో సంబంధము పెట్టుకుంటామనీ, సూక్ష్మరూపంలో దర్శనమిస్తూ వుండమని కోరుకుంటారు. వారందరికీ నేను చెప్పేదేమిటంటే వ్యక్తిగతంగా నా కందరూ ప్రియులే. అధిక ప్రేమ, సంయోగము పొందటానికి భావుకతతో కూడిన అడుక్కోవటము సరిపోదు. దీనికొఱకు- మీ హృదయంలో దృఢత్వమును, పరిపక్వతను పెంచుకొని దివ్య అనుదానాలను పొందే పాత్రతను తెచ్చుకోవాలి. నాయొక్క విశేష అనుదానాలు కూడా యీ ఆధారంగానే లభిస్తాయి. మనము మన పాత్రతలను వికసింపజేసుకొని ఆకాశంనుండి నిరంతరము కురిసే దివ్యకిరణాలనన్నిటిని వుపయోగించుకోగల్గాలి.

చింతన - మననల కు సూచనలు

*అ) ఋచో అక్షరే పరమే వ్యోమన్*

*యస్మిన్ దేవా అధి విశ్వే నిషేధుః ।*

*యస్తన్నవేదా కిమృచా కరిష్యతి*

*య యేత్ ద్విదుః స ఇమే సమాసతే ॥*

*ఆ) అంతరంగమందు దృఢత, పరిపక్వత ఎలా పెంచుకోవాలి?*

17



# నా తపశ్చర్య ప్రధాన వుద్దేశ్యము

నా తపశ్చర్య యొక్క ప్రధానమైన ప్రయోజనము యీనాటి యుగధర్మాన్ని అర్థము చేసుకోగలిగే మనోభూమిగల సుసంస్కారిత జాగృత ఆత్మలలో ప్రాణశక్తిని, సాహసాన్ని నింపుట. నా తపశ్శక్తితో యిలాంటివారే పూర్తి లాభాన్వితులౌతారు. కొన్ని సంవత్సరముల క్రిందట రామకృష్ణపరమహంస, రమణ మహర్షి, అరవింద లాంటి మహామానవులు యిటువంటి ప్రయోజనాన్ని ఆశించే యీ స్థాయి తప స్సాధనలు చేశారు. దాని ఫలితమే భారతదేశ స్వాతంత్ర్యంకొఱకు అనేకమంది వీరుల బలిదానాల రూపములో కన్పించింది. అటువంటి తపశ్చర్యల క్రమము యీనాడు ఆగిపోయినది. అందువల్ల అన్నిచోట్లా విషాదమే ఆవరించి యున్నది. ఆ రోజులలో అతి సాధారణ వ్యక్తులుకూడా సాధనములు లేకపోయినా చాలా వుచ్చస్థాయిలో పనిచేయగలిగారు. ఈనాడు అతి యెక్కువ సాధనములు వున్నా ప్రతిబంధకములు లేని పరిస్థితు లున్నా యెవ్వఱూ యేమీ చేయలేకపోతున్నారు. దేశము వున్నత పథములో సాగిపోవటానికి బదులు నిర్వీర్యమగుచున్నది. మనము శక్తివంతుల మగుటకు బదులు బలహీనుల మగుచున్నాము. ఎందువలన యిలా జరుగుతోంది? రాజనీతిజ్ఞులు దీనికేమి జవాబు చెప్పినా ఆధ్యాత్మిక స్థాయిలో దీనికి కారణ మేమిటంటే సుసంస్కారిత ఆత్మలలో సత్ప్రేరణ యొక్క ప్రచండ వుత్సాహము నింపగలిగే శక్తి కేంద్రాలు మూతబడ్డాయి. ఉచ్చస్తరీయ తపశ్చర్యల క్రమము

ఆగిపోయింది. ఆ లోటిప్పుడు తీర్చవల్సి వున్నది. నా తపశ్చర్యయొక్క ప్రయోజనము, దాని సార్ధకత- సాఫల్యము, సుసంస్కారముగల ఆత్మల మీద ఆవరించి యున్న లోభమోహములు, వాసనలు, తృష్ణలయొక్క బురదను కడిగివేయుట. వారు సంపద, అహంకార అభివృద్ధి యొక్క మృగమరీచికల నుండి బయటపడి యుగధర్మపాలన చేయుటకు అందరికంటే ముందు నిల్చుని తమ వెలుగుతో సుదూర క్షేత్రాలలో వున్న అనేక అంతఃకరణాలను ప్రభావితము చేయగల్గుతారు. ఇటువంటి మార్పు వచ్చిన పరిజనులు నాయొక్క ఆత్మీయజనుల శ్రేణిలో ప్రవేశము పొందారని తెలుసుకోవాలి. వారు నాయొక్క పూర్తి ప్రేమను, నాయొక్క తపశ్చర్యల ద్వారా వచ్చే లాభములను పొందే అర్హత సంపాదించుకున్నారు.

తమ యోగ్యత, ప్రతిభ, తెలివితేటలు, సాహసము, సంపదలను యీ యుగము యొక్క సవాలును స్వీకరించి లోభమోహ బంధనాలను తెంపుకొని బ్రాహ్మణోచిత జీవితాన్ని సంతోషంగా జీవిస్తూ సంపూర్ణ సమర్పణ చేసుకున్న వారిద్వారా నవయుగనిర్మాణము యొక్క అత్యంత గొప్పదైన పని నిర్వహించబడుతుంది. ఇటువంటి చందన వృక్షాలను, గులాబీ మొక్కలను పెంచటానికి ఒక విశాలమైన పంటను పండించటానికి నేను మీనుంచి

వీడ్కోలు తీసుకొంటున్నాను. నా తపశ్చర్యయొక్క యీ లక్ష్యాన్ని సమగ్రముగా అర్థము చేసుకోండి. ఎవరైతే దీనిద్వారా లాభాన్ని పొందాలనుకుంటున్నారో వారు తమ భవిష్యత్ క్రియాకలాపాలను యీ మూసలోనే మలచుకొనుటకు తీవ్ర నిర్ణయము తీసికుని కటిబద్ధులు కావాలి.

చింతన - మననల కు సూచనలు

*అ) లోభ మోహ అహంకార పాశములను త్రెంచుకోవాలి.*

*ఆ) అతి తక్కువ వనరులతో జీవించటము నేర్చుకోవాలి. మీకు కావాల్సిన సాదా జీవనం- ఉచ్ఛ ఆలోచనలు వుండాలి. మీకవసరమైన తిండి, బట్టలు, ఇళ్ల నిర్మాణము యెంత వీలైతే అంత తగ్గించుకోవాలి.*

18



# మాతాజీ సాధన

మాతాజీ హరిద్వార్‌లో వుండి నావలెనే 24 లక్షల 24 గాయత్రీ మహాపురశ్చరణలు చేస్తుంది. ఇవి చాలాకాలము నుండి ఆపదలో వున్న వ్యక్తులను రక్షించటానికి, బాధలో వున్నవారికి సహాయము చేయటానికి, ప్రగతిపథములో ముందుకు వెళ్లాలని కోరుకునే సాధకులకు మేము యిచ్చే నిరంతర ఆశీర్వాద పరంపరకు వుపయోగపడ్తుంది. నా జీవితమంతా కొనసాగిన యి దివ్యపరంపర ఆగిపోవటము నా కిష్టము లేదు. నేను, మాతాజీ వున్నంతవఱకు యీ క్రమము కొనసాగుతుంది. దీనికొఱకు అవసరమైన తపశ్శక్తిని మాతాజీ శాంతికుంజ్ సప్తసరోవరంలో వుండి సంపాదించు కుంటుంది. నోటితో ఆశీర్వదిస్తే యే లాభమూ వుండదు. ఆశీర్వాదముతో పాటు తపః పుణ్యములు కలిసివుండాలి. తుపాకీతూటాలో మందుగుండు సామగ్రి వున్నట్లు. మందుగుండు లేకుండా తూటా యేమీ చెయ్యలేదు. అదేవిధముగా తపస్సు యొక్క అంశము లేకుండా ఆశీర్వాదములు ఫలించవు. నేను యింతవఱకు చేసిన సేవల వెనకాల నాయొక్క తపఃశక్తి కల్సి వున్నది. ఇప్పుడు నేను చేయబోవుచున్న సాధన వుచ్ఛస్తరీయ ప్రయోజనాలకే వుపయోగించబడుతుంది. కనుక భౌతిక ఆశీర్వాదాలు సహాయము కొఱకు మాతాజీ సాధనాక్రమము నడుస్తుంది. ఈవిధంగా దూరంగా వుంటూకూడా మేమిరువురము ఒకరికొకరు పూరకాలుగా, సహాయకులుగా వుంటాము.

చింతన - మననల కు సూచనలు


*అ) 24 లక్షల గాయత్రీ మంత్ర సామూహిక అనుష్ఠాన పరంపర - మీకు నచ్చిన గురువు యొక్క సాధనలు సామూహికంగా మొదలెట్టండి.*

*ఆ) వారినికొకసారి గాయత్రీయజ్ఞం సామూహికంగా చేసికొని పూర్ణాహుతి కాలంలో యజ్ఞాగ్ని ముందు కోరికలు తీర్చుకునే వీలు కలుగచెయ్యండి.*

*ఇ) వారినికొకసారి మౌనము, అస్వాదవ్రతం పాటించే సమూహాన్ని తయారు చేసుకోండి.*

*ఈ) సామూహికతకు ప్రాముఖ్యత నివ్వండి.*

19



# నూతన యుగ సాధనా స్వరూపము

ఆధ్యాత్మిక సాధనలో యుగముయొక్క వాతావరణము మఱియు మనిషి యొక్క శారీరిక, మానసిక స్థాయినిబట్టి మార్పులు చేయవల్సి వుంటుంది. ఈనాటి దేశకాల పరిస్థితులలో ప్రాచీన గ్రంథాలలో యివ్వబడిన సాధనలు సరిపడవు. అందువల్లనే అనేక సాధనాత్మక విధివిధానాలను అనేకమంది సాధకులు అనుసరిస్తూ వున్నా తగిన ఫలితాలను పొందలేకపోతున్నారు. పరిశోధించి, అన్వేషణ చేసి, ప్రయోగములు చేసి యీనాటి సాధకులకు తొందరగా ఫలితాన్నిచ్చే ఒక యుగసాధనా స్వరూపాన్ని నిర్ధారణ చేయుట కూడా నా తపశ్చర్యల యొక్క ఒక ప్రధాన లక్ష్యము. దీనియొక్క అత్యద్భుత ఫలిత మేమిటంటే జనుల మనస్సుయొక్క దృష్టి చమత్కారాలనుండి బయటపడి ఆధ్యాత్మికతయొక్క గఱిమను, గొప్పదనాన్ని స్వీకరించి దీనిముందు నత మస్తకులౌతారు. ఈనాడు ఆధ్యాత్మికత అంటే కథలు చెప్పుకొనుట, ప్రవచనా వాచాలత, స్తోత్రపాఠాల కర్మకాండలుగా కుంటిగా నడుస్తున్నది. దీనివలన మనస్సులో కొంత పులకింత రావచ్చునుగానీ, ప్రత్యక్ష జీవితంలో మహా మానవులుగా మాఱగలిగే సామర్థ్యము, శక్తి మఱియు అంతరంగ జీవితంలో, ఉల్లాసము, సంతోషము మొదలగునవి లభించవు. అది సువ్యవస్థిత, యుగానికి తగిన మఱియు విజ్ఞాన సమ్మతమైన పరిష్కృత ఆధ్యాత్మిక సాధనా పద్ధతి ద్వారానే లభిస్తుంది. ఈనాటి పద్ధతులలో యిది కనిపించుట లేదు. కేవలము ప్రచారము, గర్వము మాత్రమే

కనిపిస్తున్నాయి. సాధకుని యొక్క బహిరంగ, అంతరంగ జీవితాన్ని సునిశ్చితముగా ప్రఖరము చేయగల్గే ఒక సమగ్ర సువ్యస్థిత సాధనా పద్ధతి యీనాడు సర్వులకు లభించాలి. ఇదికనుక మనము అందజేయగలిగితే యీనాడు భౌతిక విజ్ఞానముకంటే కోట్లరెట్లు వుపలబ్ధులు పొందుటయేకాక వ్యక్తులలో దేవత్వవుదయము, పృథ్విమీద స్వర్గావతరణము కచ్చితంగా వచ్చి తీరుతుంది. నా తపశ్చర్య యొక్క ఒక వుద్దేశ్యము యిదికూడా! ఇది యీ వీడ్కోలు ద్వారా వుండే దుఃఖము కంటే చాలా ముఖ్యమైనదని భావించి మనస్సును దృఢపరచుకున్నాను. ఈవేళ కాకపోతే రేపైనా పరిజను లీ నిర్ణయానికి రావల్సిందే!

చింతన - మననల కు సూచనలు

*అ) అంతరంగ జీవితం ప్రఖరము చేసుకోవటానికి బహిరంగ జీవితంలో చేసుకోగల్గే మార్పులు తక్షణమే చేసుకోండి. దాని కొఱకు అత్యంత ప్రేమ పాత్రులైన వారినుంచి దూరము కావల్సివచ్చినా బాధపడకండి.*

**20**



# యుగపరివర్తనకు అవసరమైన భావములు

నా యొక్క జీవిత కాలంలో అనేకమందితో వ్యక్తిగతంగానూ, నా మిషన్‌కు లభించిన స్నేహ సహకారాలను కృతజ్ఞతతో స్మరణ చేసుకుంటూ నేను వెడుతున్నాను. నాకు లభించిన అనుగ్రహాశీస్సులను జన్మజన్మలకు స్మరించుకుంటూ ఆ ఋణము నుంచి విముక్తి చెందుటకు తగిన ప్రతిదానాల నందజేస్తాను. వెళ్ళక తప్పదు కనుక వెళ్ళితీరాలి. దానినుండి తప్పించుకునే ప్రయత్నము నేను చెయ్యను. పరిపూర్ణముగా యే సమర్థ చేతనత్వానికి సర్వతోభావేన ఆత్మసమర్పణ చేసుకున్నానో, ఆయన నిర్దేశాలను మృత్యువు సమీపమునకు చేరుకున్న యీ శరీరంతో చెయ్యను అని యెలా అనగలను? ఇచ్చేశాము అంటే యిచ్చేశాము. యౌవనమంతా ఆయనకు సమర్పించినపుడు ముసలితనపు యీ కొద్దిరోజులూ సుఖము కొఱకు యెందు కాలోచించాలి? స్వజనుల ప్రేమపాశము విడిపించుకొనటము నాకు బరువుగానే వున్నది. రాబోయే రోజులలో యీ యెడబాటును శాశ్వత కలయికగా కలిపేసుకుంటాను. ప్రత్యక్షముగా యిది సంభవము కాకపోయినా పరోక్షముగా నాయొక్క ప్రతీ ఆత్మీయపరిజనులతో కల్సిపోతాను. వారి అంతరంగ, బహిరంగ జీవితములో నేను దివ్య ప్రేరణలుగా, దివ్యానుభూతులుగా, దివ్య అనుదానాలుగా, వారి అనుభవంలోకొస్తాను. మీలోని అవాంఛనీయతలను తొలగించుకొని దివ్యత్వముతో కలియుటకు ఆవిర్భవిస్తున్న సాహసముగా నన్ను మీలో అనుభూతి

చెందవచ్చును. ప్రత్యక్షముగా సలహా లివ్వటము, ఉత్తరాలు వ్రాయుట నాకు సంభవము కాదు. కానీ యింతకంటే మీకు నేను అందించే మంచి విధాన మేమిటంటే మీలో ప్రతి ఒక్కరూ కొన్ని విశిష్ఠ సంకల్పములు, సలహాలు, సాహసము వుత్పన్న మౌతున్నట్లు స్పష్టముగా అనుభవిస్తారు. ఇంకెవరెవరో మిమ్ములను అలా ఆలోచించమనీ, అలా ప్రవర్తించమనీ, బాధ్యులను చేస్తున్నట్లు అనుభూతి చెందుతారు. నెత్తికెక్కిన భూతము గూర్చిన కథలు వింటూనే వుంటాము. నేనూ ఒక దివ్యభూతము వలె మీ ముందు వెనుకా వుంటూనే వుంటాను. తప్పు మార్గంలో పోతే భయపెడతాను. సన్మార్గాన నడిస్తే మీకు రకరకాల బహుమతుల నిస్తాను. మీరు శాంతచిత్తులుగా వున్నప్పుడు, నాలో ఆనంద ఉత్సాహాలు పెల్లుబికి నప్పుడు, మీ యొక్క అంతరంగములో ఈవిధమైన భావాలు ఆవిర్భవిస్తాయి.

1. అత్యంత విలువైన యీ మానవ జీవితము వుదరపోషణ కొఱకు, కుటుంబ ప్రయోజనము కొఱకు ఖర్చుపెట్టే యీనాటి పరిస్థితులు మూర్ఖత్వంతో కూడినవి.

2. సాదాగా జీవించటము నేర్చుకో! కుటుంబములోని సభ్యులందఱిని సుసంస్కార వంతుల్ని చేసి వారు తమ కాళ్ళమీద తామే నిలబడేటట్లు చేయటమే మీ బాధ్యత. పిల్లలు, మనుమల కొఱకు డబ్బు కూడబెట్ట వద్దు. దానివల్ల వారు బాగుపడరు.

3. ఇది యుగసంధి కాలము. నవయుగము త్వరితగతిన పరిగెత్తుకుంటూ వచ్చు చున్నది. దానికి సహకరించు. నీ యొక్క ఆలోచనలు, క్రియాకలాపాలను- ఏకత, సమత, శుచి మఱియు మమత ఆధారముగా యేర్పడనున్న వాతావరణమునకు అనుగుణ్యంగా మలచుకో!

**4.** పరమార్థము పేరుమీద ప్రచారాలు చేయవద్దు. ఈనాటి లెక్కలేనన్ని సమస్యలు, కష్టాలకు కారణము వికృతి చెందిన ఆలోచనలు అని తెలుసుకొని విచారక్రాంతి కొఱకు జ్ఞానయజ్ఞ ప్రక్రియను యుగధర్మముగా గుర్తించి నీ సమస్త ప్రతిభను, వనరులను దానికొఱకు వినియోగించు.

**5.** సంయమనము అలవరచుకో! (ఐ.।.జ.జా.) సాదాజీవితము జీవించు. సత్ప్రవృత్తుల, సద్భావనల సహాయము తీసుకో. తద్వారా ప్రభుసమర్పిత జీవితము జీవించుట సంభవ మౌతుంది.

**6.** ఉపాసన యొక్క నిత్యకర్మను కొనసాగించు. నీ మొత్తము సమయము జీవన సాధనకు వినియోగించు. జీవనసాధన అనగా -- శరీరము, మనస్సు, ధనమును సాధ్యమైనంత తక్కువను నీకొఱకు వుపయోగించుకొని అత్యధిక భాగాన్ని విశ్వ మానవునకు సమర్పితము చేయుట.

**7.** పరమార్థ మార్గములో ముందుకు వెళుతున్నప్పుడు నీ ఆంతరిక బలహీనతల వలన, మిత్రులు, కుటుంబీకుల ద్వారా వచ్చే అవరోధాలకు, ఎగతాళి హేళనలకు భయపడకు. ఆధ్యాత్మిక మార్గముమీద అత్యంత సాహసముతో అడుగులు వెయ్యి. నీతోపాటు నీయొక్క ఆత్మ, ఆచార్యజీ, ఆయనయొక్క గురుదేవులు మఱియు భగవంతుడు వున్నాడనే కచ్చితమైన విశ్వాసము వుంచుకో. నిన్ను యీ నలుగురు నావికులు తెడ్డువేసి తీరము దాటిస్తారు.

8. అనేక లక్షల సంవత్సరముల తర్వాత యీ యుగసంధి యొక్క కాలము 'మానవీయ కర్తవ్యములను పాలించు' అనే సవాల్ మీకు లభించింది. ఈ అద్భుత అవకాశాన్ని పోగొట్టుకొనకూడదు. ఎంతోకొంత చేసి చూపించాలి.

9. ఒక సఫల జీవితమును జీవించిన వ్యక్తికి వీడ్కోలు యివ్వటానికి మీరు వచ్చారు. ఆయన జీవిత సాధనాక్రమాన్ని, దానియొక్క ప్రతిక్రియలను మఱియు సంపదలను అర్థము చేసుకోవాలి. ఆ జీవిత విధానాన్ని అనుసరించే సాహసము చూపించగల్గాలి.

10. మీరు నిశ్చింతగా కూర్చొనజాలరు. లోభ, మోహ, వాసనలతో కూడిన జీవితమును జీవిస్తే ఆత్మ యొక్కేకాక ఆచార్యుల వారి దండనలుకూడా మీరు పొందాల్సి వుంటుంది. ఇది మిమ్మల్ని రాత్రిపగలు శాంతిలేకుండా చేస్తుంది. అందువల్ల మీరు శ్రేయదీ పథములోనే నడచుట మంచిది.

చింతన - మననల కు సూచనలు

*అ) పై పది లక్షణాలు మీలో కనిపిస్తున్నాయా? అన్నదానికి జవా బిచ్చుకోండి.*

## 21



# ఋణానుబంధాలు

ఈనాడు సర్వవ్యాపి సర్వభక్ష స్థాయిలో వున్న పాప, అనాచారముల యొక్క విజృంభణ చాల భయంకరముగా కన్పించుచున్నది. ఇంత శక్తివంతమైన ఆసురీ మాయాజాల ప్రభావమునుండి యెలా బయటపడగలమనే నిరాశ యేర్పడుతున్నది. కానీ ఒక విషయము గుర్తుంచుకోండి. పాపము యెంత ప్రబలినా దాని అంతరంగము పుచ్చిపోయి వుంటుంది. సమర్థమైన ప్రతిఘటన లేనంతవఱకే దాని వునికివుంటుంది. ఇప్పుడు సమర్థ ప్రతిఘటన వుత్పన్నము చేయుటకు ఒక మహా అభియానము ఆరంభించబడినది. దాన్ని ముందుకు తీసుకుని వెళ్ళుటకే మీరిన్నేళ్ళబట్టీ పనిచేస్తున్నారు. ఇకముందు యింకా యెక్కువ త్వరితగతిలో యీ అభియానానికి చలనాన్నివ్వటానికి, శపథము తీసుకొనుటకు, ఈ వీడ్కోలు సమారోహానికి మీరు వచ్చియున్నారు. నిప్పు యొక్క ఒక చిన్న కణము విశాలమైన అడవిని భస్మము చేయగలదు. కంసుడు, జరాసంధుడు, కౌరవులు, హిరణ్యకశిపుడు, వృత్రాసురుడు, రావణుడు మొదలగు అసురుల సామర్థ్యము చూచి వారిని జయించుట అసాధ్యమనిపించేది. కానీ సమర్థ ప్రతిఘటన దానికి యెదురు నిల్చినప్పుడు ఆ విపత్కర పరిస్థితులు కాగితంతో చేసిన పులి వలె అతి సులభంగా భస్మమైపోయాయి. ఈనాడు వ్యక్తులలో పిఱికితనము, అహంకారము, తృష్ణ, దుర్బుద్ధి యెంత ప్రవేశించినప్పటికి, రాబోయే రోజులలో వాటిని పూర్తిగా తుడిచిపారేసి

మానవీయ అంతఃకరణములో దైవత్వమును తిరిగి ప్రతిష్ఠింపబోవుచున్నాము. సమాజములో దుష్ప్రవృత్తులు, దుర్భావనలు, భ్రష్ట పరంపరలు యెంత లోతుగా పాతుకుపోయివున్నా రాబోయే రోజులలో వాటిని పెకలించిపారేసి, స్వర్గీయ వాతావరణము యొక్క సత్ప్రవృత్తులను సర్వవ్యాపకము గావించి, దేవసమాజము నేర్పరిచి, రామరాజ్యపు పరిస్థితుల్ని మళ్ళీ యేర్పరుస్తాను. తప్పనిసరిగా యీ భవితవ్యతను తెలియజెప్పటానికే నేను వచ్చాను. జ్ఞానయజ్ఞపు ఎఱ్ఱకాగడా ప్రకాశాన్ని అన్ని దిక్కులకు ప్రసరింపజేసి నేను వీడ్కోలు తీసుకుంటున్నాను. ఈ వీడ్కోలు అందర్నీ వదిలివేయుటకు కాదు. ఈ కాగడాను యింకా యెక్కువ ప్రఖరము చేయుటకు, యింకా యెక్కువ ఆవునెయ్యి సంపాదించుటకు, తద్వారా మందముగా వెలుగుతున్న యీ జ్యోతి యెక్కువ వ్యాపకమై విస్తృతమై ప్రఖరమవుటకు నేను నా పని చేస్తాను. మీరు మీ పనిచేయవల్సి వుంటుంది. ఈ జ్ఞానయజ్ఞ కాగడాను యుగనిర్మాణ పరివారముయొక్క ప్రతి సదస్యుని చేతిలోకి అందజేస్తాను. దీన్ని ఒరిగిపోనివ్వవద్దు. ఆరిపోనివ్వవద్దు. ఈ బాధ్యతను పరివార్‌లోని ప్రతి పరిజనుని భుజస్కంధాల మీద వుంచుతున్నాను.

చింతన - మననల కు సూచనలు

*అ) యుగనిర్మాణ పరివారమనగా అన్ని ఆధ్యాత్మిక సంస్థలలోని వ్యక్తులు. వారు యీ జ్ఞానజ్యోతి యెలా ప్రజ్వరిల్లింపజేయగలరో అవగాహన చేసుకోండి.*

22



# వ్యక్తిగా నా ఉదాహరణ

వీడ్కోలు సందేశము చివరి చరణముగా నేను యింతమాత్రమే చెప్పదలచుకున్నాను-నన్ను ప్రేమించే పరిజనులు లోభ మోహముల జంఝాటముల నుంచి బయటపడటానికి పూర్తిగా ప్రయత్నించండి. వ్యక్తిగత, భౌతిక మహత్వకాంక్షల బురద నుండి బయటపడి విశ్వమానవుని ఆరాధన కొఱకు త్యాగము, బలిదానాల పరంపర పెంచుకుంటూపొండి. నా ప్రస్తుత జీవితక్రమము మాటలద్వారా కాక, వ్యక్తిగత వుదాహరణగా ఈశ్వరభక్తి నుండి జీవితాన్ని సార్థకము చేసుకొనుట వఱకు, ప్రబుద్ధ సుసంస్కారముగల ఆత్మలకు ఒక సునిశ్చిత మార్గమును వుంచుతుంది. ఈనాటి పరిస్థితులలో సద్భావనాసంపన్నులగు ఆత్మలు తప్పనిసరిగా చేయవల్సిన యుగధర్మ మేమిటి? సమయానుకూలమైన యుగసాధన యేమిటి? అనేది నేను తెలియజేశాను. మహాకాలుడు నా కందచేసిన పనియొక్క పూర్వార్ధమును పూర్తిచేసి వెళ్ళిపోతున్నాను. ఉత్తరార్థము రాబోవు రోజులలో పూర్తిచేస్తాను. ప్రభు సమర్పిత జీవితముయొక్క దిశ యేమౌతుం దనేది నా మాటలతోకాక భావనలు, క్రియా కలాపాలను చూచి నేర్చుకోండి. వినాశనము కొఱకు యితఱులెంత చేశారో అంతకంటే యెక్కువ పురుషార్థమును విశ్వముయొక్క నూతన నిర్మాణమునకు చేయవల్సివచ్చి యున్నది. ఈ సందర్భములో మీలాంటి నలనీలులు, హనుమ, జాంబవంతుల బాధ్యతలు చాలా యెక్కువ. దాన్నర్థము చేసుకోండి. ఈ

యుగముయొక్క సవాలును స్వీకరించగలిగే సమర్థ వీరులు అర్జునుని వలె ఆలస్యము చేయకుండా లేచి నిలబడండి.


చింతన - మననల కు సూచనలు

*అ) గురుదేవులు చేసిన పూర్వార్ధమేమిటో అర్థము చేసుకోండి.*

*ఆ) హరిద్వార్ నుండి ఉత్తరార్ధముగా ఆయన చేసిన క్రియాకలాపాలను అర్థము చేసుకోండి.*

*ఇ) తక్షణమే మీరు ఆచరించగలిగే ప్రణాళిక వేసుకుని చేయండి. వీలు చూచుకుని చేస్తామని వేషాలు వెయ్యవద్దు.*

23



# నామీద ప్రేమ చేతలతో చూపించండి

జీవితమంతా నేనేమి చెప్పానో దానిని అతి వుగ్ర మనఃస్థితిలో యీ నాల్గు రోజులలో మీయొక్క అంతఃకరణములలో ప్రతిష్ఠించటానికి ప్రయత్నించాను. నేను మీకిచ్చినటువంటి యీ బాధ, వ్యధ, మార్గదర్శనము అను నిప్పుకణమును మీవెంట తీసికొని వెళ్ళి మీ సంపర్కక్షేత్రములలో దానిని దావానలముగా విస్తరింప జేస్తారని నేను విశ్వసిస్తున్నాను. మీ మనస్సులో నామీద యేమాత్రము శ్రద్ధ, ఆత్మీయత వున్నా మీకేమి చెయ్యాలో తెలుస్తుంది మఱియు జ్ఞానయజ్ఞము ద్వారా చేయబడే యీ నవనిర్మాణ మహాఅభియానములో యెక్కువ తత్పరతతో పనిచేయటము మొదలెట్టాలి.

చింతన - మననల కు సూచనలు

*అ) నెలవారీగా ప్రణాళిక వేసుకుని యీ దిశలో మీ రెలా ముందుకు వెళ్తున్నారో, యెవఱి సహాయము తీసుకుంటారో ప్రణాళిక వేసుకోండి.*